



అక్రమ తవ్వకాలతో రూపు కోల్పోతున్న అటవీ ప్రాంతం

కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి

తరలిపోతున్న నల్ల బంగారం!

- పెద్దిశెట్టిపల్లెలో గ్రానైట్ అక్రమ తవ్వకాలు
- వ్యవహారం నడిపిస్తున్న గుడిపాల మండలానికి చెందిన చోటా నేత

చిత్తూరు రూరల్ మండలంలోని పెద్దిశెట్టిపల్లెలో గ్రానైట్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడున్న ఓ గుట్టలో అరుదుగా లభించే జీ-20 (నల్ల రాయి) ఉండటమే దీనికి కారణం. ఈరాయి క్యూబిక్ మీటరు ధర రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతుంది. అందువల్లే ఈ రాయికి నల్లబంగారం అనే పేరొచ్చింది. ఈ రాయికి మన రాష్ట్రంతో పాటు తమిళనాడులోనూ డిమాండ్ ఉంది. దీన్ని గుర్తించిన గుడిపాల మండలానికి చెందిన ఓ చోటా నేత అక్రమ దందాకు తెరలేపాడని స్థానికులు చెబుతున్నారు. ఎటువంటి అనుమతి లేకుండా గుట్టను కొల్లగొడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి

పెద్దిశెట్టిపల్లె గ్రామ అటవీప్రాంతంలోని కొండను పేల్చడానికి భారీగా జిలెటిన్ స్టిక్స్ వాడుతున్నారు. దీనివల్ల అధిక శబ్దాలు రావడంతో చుట్టుపక్కల గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల దీనిపై అధికారులకు ఫిర్యాదులు అందడంతో కొన్ని రోజులు తవ్వకాలు ఆపి, మళ్లీ యథావిధిగా కొనసాగిస్తున్నారు. నల్లరాయిని అక్రమంగా తరలించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో గండి పడుతోంది.

రెండు షిఫ్టులుగా తవ్వకాలు

రాత్రీపగలు తేడా లేకుండా రెండు షిఫ్టులుగా తవ్వకాలు జరుపుతున్నారు. రోజుకు 10 లారీలతో రవాణా చేస్తున్నారు. రాత్రయితే పెద్దపెద్ద శబ్దాలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కొత్తగా వేసిన తారురోడ్డు పూర్తిగా పాడవుతోందని స్థానిక గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

రెండు నెలలుగా అక్రమ తవ్వకాలు జరుగుతుంటే రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు కొన్ని రోజులు ఆగి పనులు చేసుకోండని ఓ అధికారి సలహా ఇచ్చాడని కూడా సమాచారం.



ఎక్స్‌కవేటర్‌తో జరుపుతున్న తవ్వకాలు

తరలించేదిలా..

పెద్దిశెట్టిపల్లె గ్రామం నుంచి కూతవేటు దూరంలోనే గుడిపాల మండల ఉంటుంది. దీనికి పక్కనే తమిళనాడు సరిహద్దు ఉంది. దాంతో గుడిపాల మండలం మీదుగా నల్లబంగారాన్ని తమిళనాడుకు యథేచ్ఛగా తరలిస్తూ కోట్లు గడిస్తున్నారు. అలాగే గుడిపాల మండల పరిసర గ్రానైట్ ఫ్యాక్టరీలకూ నల్లరాయిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇకనైనా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల గ్రామస్తులు కోరుతున్నారు.



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

సినిమా పిచ్చే దొంగను చేసింది!

- బంగారు దుకాణంలో చోరీ కేసులో నిందితుడి అరెస్టు
- మూడు రాష్ట్రాల్లో 23 కేసులు నమోదైనట్లు గుర్తింపు



నిందితుడు ఆనంద్

చిత్తూరు అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చిల్లర దొంగకు సినిమా పిచ్చి పట్టింది. 'కీచకుడి'తో అప్పులపాలు చేసింది. పెద్ద దొంగతనాలకు ఉసిగొల్పింది. చివరకు అంతర్రాష్ట్ర దొంగగా మార్చింది. ఆ వివరాలను డీఎస్పీ సాయినాథ్, సీఐలు నెట్టికంఠయ్య, మహేశ్వరలతో కలిసి ఏఎస్పీ రాజశేఖర్‌రాజు ఆదివారం చిత్తూరు పోలీసు అతిథి గృహంలో మీడియాకు వివరించారు. ఈనెల 4న చిత్తూరు నగరంలోని జెండామానువీధి శరవణ బంగారు దుకాణంలో సుమారు 131.5 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లినట్లు యజమాని శరవణ ఆచారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ మణికంఠ ఆదేశాలతో రెండు ప్రత్యేక బృందాలు పది రోజులుగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో విచారణ ప్రారంభించాయి. సీసీ ఫుటేజీ, ఇతర సాంకేతికతను వినియోగించి గాలింపు చేపట్టాయి. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం బెంగళూరు-చెన్నై బైపాస్ రోడ్డులోని శృతి మిల్క్ డెయిరీ ఎదురుగా కర్ణాటక రాష్ట్రం ఎంఆర్ఎస్ పాళ్యం నంది దుర్గా రోడ్డుకు చెందిన ఆనంద్(39)ను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా బంగారం దుకాణంలో చోరీ చేసిందని తానేనని ఒప్పుకున్నాడు. అతడి నుంచి రూ.12లక్షల 131.5 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3లక్షల వెండి ఆభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన రూ.2లక్షల కారుతో కలిపి మొత్తం రూ.17లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సినిమా అంటే తనకు పిచ్చి అని తెలిపాడు. ఈ క్రమంలో కీచకుడు సినిమా తీసి.. విడుదల కాకపోవడంతో అప్పులపాలయ్యానని, ఈ అప్పు తీర్చడానికి షార్ట్ ఫిలిమ్ తీద్దామంటే డబ్బులు లేకపోవడంతో దొంగతనాలకు పాల్పడ్డానని నిందితుడు పోలీసులకు తెలిపాడు. ఇతడిపై ఏపీతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో 23 కేసులు నమోదైనట్లు గుర్తించారు. కేసును ఛేదించడానికి కృషిచేసిన పోలీసులకు నగదు బహుమతులను అందించారు. జిల్లాలో ఇప్పటికే 3,300 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, మిగిలిన చోట్ల కూడా ఏర్పాటు చేయాలనుకుంటున్నామని ఏఎస్పీ చెప్పారు. స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు, దుకాణదారులు సహకరించి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు.



ఏనుగుల మంద దాడిలో ధ్వంసమైన బోరు మోటారు, పైపులు

పంటలపై ఆగని గజదాడులు

కల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీలోని పంటలపై ఏనుగుల మంద దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి శనివారం రాత్రి బయల్దేరిన 14 ఏనుగుల మంద పాళెం వద్దకు చేరుకున్నాయి. గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. అక్కడినుంచి పులిచెర్ల-కల్లూరు రోడ్డును దాటుకుని కొంగరవారిపల్లె వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతు రామనాథంనాయుడుకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసి, పశుగ్రాసాన్ని తొక్కేశాయి. నీటి పైపులను ఎక్కడికక్కడ విరిచేసి.. సమీపంలోని బోరు మోటర్‌ను కదిలించడంతో దెబ్బతింది. అనంతరం కోటపల్లె మీదుగా అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. మార్గంలోని పలువురు రైతుల మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. ఆదివారం పగలంతా తూర్పు విభాగం అడవిలోని ఎగువచలం వద్ద తిష్ఠవేసినట్లు అటవీశాఖ అధికారులు మహమ్మద్ షఫీ, కృష్ణమూర్తి తెలిపారు.

వరసిద్ధుడి భక్తులు ఇబ్బంది పడకూడదు

దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్



అన్నప్రసాదాలను పరిశీలిస్తున్న రామచంద్ర మోహన్

ఐరాల(కాణిపాకం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): 'స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి విచ్చేసే భక్తులు ఇబ్బంది పడకూడదు. ఆ దిశగా చర్యలు తీసుకోండి' అని అధికారులను దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశించారు. ఆదివారం ఆయన కాణిపాకం రాగా, ఎమ్మెల్యే మురళీమోహన్ స్వాగతం పలకారు. అనంతరం కమిషనర్ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అన్నదాన కేంద్రానికెళ్లారు. అన్నప్రసాదాలు ఎలా ఉన్నాయని భక్తులను అడిగి తెలుసుకున్నారు. వినాయక సదన్, గణేష్ సదన్‌లో గదుల నిర్మాణాన్ని వేగవంతం చేసి.. భక్తుల బసకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆలయ అభివృద్ధిపై ఎమ్మెల్యేతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఏసీ చిట్టెమ్మ, ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పీజీఆర్‌ఎస్'

చిత్తూరు అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను అధికారులు తీసుకుంటారని పేర్కొన్నారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ పీజీఆర్‌ఎస్ నిర్వహించాలని సూచించారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్‌ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'తోతాపురి' కిలోకు రూ.6కి మించి ఇవ్వలేం

- కాదంటే ఫ్యాక్టరీలు మూసేయడానికి సిద్ధమంటున్న యాజమాన్యాలు
- మంత్రి అచ్చెన్న జిల్లాకొచ్చి ఆదేశాలిచ్చినా రైతులకు నిరాశే మిగిలింది

జిల్లాలో మామిడి అమ్మకాల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. మామిడి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో కలెక్టర్, ఎమ్మెల్యే, మంత్రి, చివరకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు క్షేత్రస్థాయిలో ఆచరణ సాధ్యం కాకపోవడంపై తీవ్ర గందరగోళ పరిస్థితులకు దారితీస్తున్నాయి.



విజయపురంలో చెట్టుకే వదిలేసిన తోతాపురి మామిడి కాయలు

చిత్తూరు సెంట్రల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కిలోకు మద్దతు ధర రూ.12గా నిర్ణయించారు. ఇందులో ప్రభుత్వం సబ్సిడీగా రూ.4 ఇస్తుండగా, ఫ్యాక్టరీలు రూ.8 ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యానశాఖ మంత్రి అచ్చెన్నాయుడు శనివారం జిల్లా వేదికగా ఆదేశించారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. మంత్రి ఆదేశాలను ఆదివారం ఫ్యాక్టరీ యాజమాన్యాలు అమలు చేస్తాయని భావించిన రైతులకు నిరాశే మిగిలింది.

ఆరు రూపాయలకు మించి ఇవ్వలేం

కిలోకు ఆరు రూపాయలకు మించి ఇవ్వలేమని పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. అంతకుమించి ఇవ్వాలంటే ఫ్యాక్టరీలు మూసేయడానికి సిద్ధమని పేర్కొంటున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను గౌరవిస్తామని, అయితే నష్టానికి వ్యాపారాలు చేయలేం కదా అని చెబుతున్నాయి. ఎందుకంటే గత ఏడాదే 2.50 లక్షల టన్నుల పల్ప్ నిల్వలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఇందులో 50 టన్నుల చెడిపోగా, లక్ష టన్నుల వరకు ఇంకా నిల్వ ఉందని చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తోతాపురి కిలోకు రూ.8 ఇవ్వాలంటే తాము నష్టపోతామంటున్నాయి.

15 ఫ్యాక్టరీల్లోనే ఉత్పత్తి

జిల్లాలో మొత్తం 39 పల్ప్ ఫ్యాక్టరీలున్నాయి. ఇందులో 25 ఫ్యాక్టరీలు ఈ ఏడాది పల్ప్ తయారీకి ముందుకొచ్చాయి. అయితే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో కేవలం 15 ఫ్యాక్టరీల్లోనే ఉత్పత్తి ప్రారంభమైంది. మరోవైపు తమకు కర్ణాటక, తమిళనాడు నుంచి కేవలం కిలో రూ.4లకే కాయలు అందుతుండటంతో ఇక్కడి రైతుల శ్రేయస్సు దృష్ట్యా రూ.6కి మించి ఇవ్వలేమని యాజమాన్యాలు చెబుతున్నాయి.

తోటల్లోనే రాలిపోతున్న కాయలు

మద్దతు ధర లభించక పోవడంతో పక్వానికి వచ్చిన కాయలు తోటల్లోనే రాలిపోతున్నాయి. మరోవైపు ఫ్యాక్టరీల వద్దకు తీసుకొచ్చిన కాయలను రూ.6కి ఇవ్వాలా వద్దా అని ఇంకొందరు రైతులు తర్జనభర్జన పడుతున్నారు.

లైసెన్స్‌లు రద్దు చేయండి

మంత్రి ఆదేశాలను అమలు చేయని ఫ్యాక్టరీల లైసెన్స్‌లు రద్దు చేయాలంటూ మామిడి రైతుల సంక్షేమ సంఘం కమిటీ కన్వీనర్లు జనార్ధన్, హరిబాబు, ఆనందనాయుడు, ఉమాపతి తదితరులు మండిపడుతున్నారు. ఈ మేరకు ఫ్యాక్టరీల్లో మద్దతు ధర అమలుపై సోమవారం మరో సారి కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలవనున్నట్లు తెలిపారు. ఫ్యాక్టరీల ముందు ధరల పట్టికను ప్రదర్శించాలని డిమాండ్ చేస్తున్నారు. మద్దతు ధర అమలు చేయకుంటే ఫ్యాక్టరీల ముందు ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు.





కుప్పం మండలం కంగుందిలో యోగాసనాలు వేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

యోగాతో మానసిక ఆరోగ్యం

కుప్పం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని.. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21న పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కుప్పం నియోజకవర్గ పరిధిలోని కుప్పం మండలం కంగుంది కోటలో ఆదివారం యోగా సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఏటా అన్ని మండల కేంద్రాల్లో యోగా శిక్షణ శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి గౌరి, విద్య మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్, డీఎస్డీవో బాలాజి, ఆర్డీవో శ్రీనివాసరాజు, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, తహసీల్దార్లు, పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న గురవయ్య

40 శాతం మంది వినియోగదారుల్లో అసంతృప్తి

అధికారుల పనితీరుపై విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య ఆగ్రహం

చిత్తూరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో 40 శాతం కంటే ఎక్కువ మంది విద్యుత్ వినియోగదారులు వారికి అందుతున్న సేవలపై అసంతృప్తితో ఉన్నారు. దీన్నిబట్టి మీ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు' అని అధికారులపై విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. దాదాపుగా 90 శాతం మంది అధికారులు, ఉద్యోగులు ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉండడం లేదన్నారు. రాత్రిపూట విద్యుత్ సమస్య ఉందని ఫోన్ చేస్తే పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారన్నారు. కనీసం లైన్‌మెన్ కూడా ఆయా మండల కేంద్రాల్లో నివాసం లేకుంటే అర్ధరాత్రి విద్యుత్ సమస్య ఏర్పడితే ఎలా పరిష్కరిస్తాడని మండిపడ్డారు. ఇకపై అలా కుదరదని అధికారి, సిబ్బంది ఆయా కేంద్రాల్లో నివాసం ఉండాలని స్పష్టం చేశారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురైతే 48 గంటల్లో ఇవ్వాలని నిబంధనలు ఉన్నా.. ఇవ్వడం లేదన్నారు. నేటికీ రైతే తన ట్రాక్టర్ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకెళ్లడం ఆగలేదన్నారు. పల్లెలకు ఎంతో ఉపయోగపడే ఆర్డీఎస్ఎస్ పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని, ఎక్కడ సమస్య ఉందని ప్రశ్నించారు. వర్క్‌ఆర్డర్లు పెండింగ్‌పై ఎన్నిసార్లు నోటీసులు తీసుకుంటారు? వాటిని ఎప్పటిలోపు పూర్తి చేస్తారో చెప్పాలని ఏఈలను నిలదీశారు. అధికారులు, సిబ్బంది తమ పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు సురేష్, జగదీష్, అమర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి





చంద్రమ్మ(ఫైల్ ఫొటో) - తీవ్రంగా గాయపడిన వినోద్

శ్రీరంగరాజపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎస్ఆర్ పురం మండలంలోని చిన్నతయ్యూరుకు చంద్రమ్మ(60) చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా, ఎస్ఆర్‌పురం నుంచి శెట్టివానత్తం గ్రామానికి చెందిన వినోద్(20) ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చంద్రమ్మ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య



రవి (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం,జూన్15 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. వేపనపల్లెకి చెందిన రవి (52) రాగిమానుపెంట సమీపంలోని మామిడితోటలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇటీవల ఇల్లు నిర్మించుకున్నాడు. దీనికోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో ఆందోళన చెందాడు. ఈక్రమంలో ఆదివారం పురుగుల మందుతాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఇతడ్ని చిత్తూరుకు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేశారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు

భక్తులతో పోటెత్తిన బోయకొండ

● సేవా టిక్కెట్లతో ఒక్కరోజు రూ.15 లక్షల ఆదాయం

చౌడేపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. వేకువజామునే ఆలయ అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. సుమారు 35 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ సేవా టిక్కెట్ల ద్వారా ఒక్కరోజులో ఆలయానికి రూ.15లక్షల ఆదాయం చేకూరింది. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఆలయ ఈవో ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని ప్రసన్న వేంక టేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం ఉదయం చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం 9.15- 10.30 గంటల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడికి, చక్రత్తాళ్వార్‌కు పుష్కరిణి ఎదురుగా స్నపన తిరుమంజనం జరిగింది. రాత్రి 7- 7.30 గంటల మధ్య గరుడ పటాన్ని ధ్వజావరోహణం చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి

కిట్లు ఎక్కడనుంచి తేవాలి?

● కొవిడ్ టెస్ట్ కిట్లు తెచ్చుకోమని రోగులకు రాసిస్తున్న స్విమ్స్ వైద్యులు

● చీటీలు పట్టుకుని ఊరంతా తిరుగుతున్న రోగుల బంధువులు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

నెల్లూరు సమీపంలోని కొత్తూరు నుంచి వెంకటస్వామి (56) చికిత్స కోసం శనివారం ఉదయం స్విమ్స్ ఆస్పత్రికి వచ్చారు. ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్న ఆయన కాలుకు ఇన్ఫెక్షన్‌తోపాటు కడుపు ఉబ్బరంగా ఉండడంతో కుమారుడు శ్రీకాంత్ స్విమ్స్‌కు తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి క్యాజువాల్టీలో చేర్చుకున్నారు. అతడికి కొవిడ్ టెస్ట్ చేయాలని కిట్ బయట కొనుక్కొని రావాలని సిబ్బంది సాయంత్రం చీటీ రాసి శ్రీకాంత్‌కు ఇచ్చారు. ఆ చీటీతో ఆయన నగరంలోని ఎన్నో మెడికల్ షాపులకు తిరిగారు. ఎక్కడా కిట్ దొరక్కపోవడంతో స్విమ్స్‌కు తిరిగి వెళ్లారు.

ఇలా ఎందరో కొవిడ్ కిట్ల కోసం తిరుగుతున్నారు. కరోనా వైరస్ నిర్ధారణ కోసం ఆర్టీపీసీఆర్ పరీక్షను ప్రామాణికంగా తీసుకుంటారు. స్విమ్స్, రుయాస్పత్రుల్లో అనుమానం ఉన్న రోగులకు ఇవి చేస్తున్నారు కూడా. దీని ఫలితం వచ్చేందుకు ఆరేడు గంటల సమయం తీసుకుంటుంది కాబట్టి ర్యాపిడ్ యాంటిజెన్ టెస్ట్ కిట్స్ ద్వారా తాత్కాలిక నిర్ధారణ కోసం పరీక్షిస్తుంటారు. గతంలో వచ్చిన కొవిడ్ దశల్లో ర్యాపిడ్ టెస్ట్ కిట్లు ప్రైవేట్ మందుల షాపుల్లో దొరికేవి. ప్రస్తుతం కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో ర్యాపిడ్ కిట్లు ప్రైవేట్ సరఫరా లేదు. అదితెలియక స్విమ్స్ సిబ్బంది అనుమానిత రోగులకు ర్యాపిడ్ టెస్టు కిట్లు రాయడం వల్ల వాటికోసం అలిసిపోయేలా తిరగాల్సి వస్తోంది. ఇకనైనా కిట్లు అందుబాటులోకి వచ్చేవరకు స్విమ్స్‌లో చేసే ఆర్టీపీసీఆర్ పరీక్ష ద్వారానో, ప్రభుత్వం సరఫరా చేసే కిట్లనో వినియోగించాల్సి ఉంది.

ర్యాపిడ్ కిట్లు అందిస్తాం

అనుమానిత రోగులకు కొవిడ్ నిర్ధారణకు ఆర్టీపీసీఆర్ ద్వారా టెస్ట్ చేయాలి. ఒకవేళ అత్యవసరమనిస్తే ర్యాపిడ్ టెస్టు చేయాలి. ప్రస్తుతం ప్రైవేట్‌గా అవి అందుబాటులోకి రాలేదు. నేడో, రేపో 700 ర్యాపిడ్ టెస్టు కిట్లు ఆస్పత్రులకు పంపిణీ చేయనున్నాం. ఇటీవల కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో 16 మందికి పాజిటివ్ వచ్చింది. అయితే ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవు. హోం ఐసోలేషన్ ద్వారానే తిరిగి నెగటివ్ వస్తోంది.

- బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌వో

ముగిసిన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్

● నేటి నుంచి పూర్తిస్థాయిలో పాఠశాలలకు ఉపాధ్యాయులు



ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా టీచర్ల పదోన్నతులు, బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ స్థానిక షర్మన్ మెమోరియల్ పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ముగిసింది. 3,334 మంది ఎస్జీటీలను బదిలీలు చేశారు. వీరిలో.. 3,095 మంది తెలుగు, 49 మంది తమిళం, 190 మంది ఉర్దూ ఉన్నారు. చివరి రోజున మైనర్ మీడియాగా పిలువబడే తమిళం, ఉర్దూలకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. స్పౌజ్ కేసుల్లో అక్కడక్కడా కొంత గందరగోళం నెలకొనగా, డీఆర్వో మోహన్ కుమార్ జోక్యం చేసుకుని పరిస్థితి సర్దుబాటు చేశారు. పరిస్థితులు తీవ్రతరమైనప్పుడు ఆర్జేడీ, జిల్లా పరిశీలకుడు శామ్యూల్ దగ్గరుండి సమస్యలు పరిష్కరించారు. ఈనేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల నేతల్ని కొంతదూరం పెట్టడంపై అభ్యంతరాలు వచ్చాయి. అయినా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో డీఆర్వో ఆధ్వర్యంలో కొంత కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. కాగా, డీఈవో పూల్‌లోని లాంగ్వేజ్ పండిట్ (ఎస్జీఈ/పీఈటీ)లకు సైతం క్లియర్ వేకెన్సీలు చూపి, వెబ్ ఆప్షన్ ద్వారా పనిచేసే స్థానాలు కేటాయించారు. అయితే తమకు అన్యాయం జరిగిందని, వెబ్ ద్వారా కాకుండా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని లాంగ్వేజ్ పండిట్‌లు డీఈవో వరలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. వెబ్ కౌన్సెలింగ్‌లో ఇప్పటికే మీరు బదిలీ కావడం వల్ల మ్యానువల్ కౌన్సెలింగ్ చేపట్టలేమని ఆమె స్పష్టం చేశారు.

గతనెల 21 నుంచి మొదలైన ప్రక్రియ

గతనెల 21న మొదలైన హెచ్ఎంల బదిలీల ప్రక్రియ 30వ తేదీకి, స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు జూన్ 4వ తేదీకి ముగిసింది. స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 హెచ్ఎంల పదోన్నతి ప్రక్రియ గత నెల 31వ తేదీ నాటికి, ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి ప్రక్రియ ఈ నెల 6వ తేదీకి ముగిసింది. కాగా, ఎస్జీటీల బదిలీలను ప్రభుత్వం వెబ్ ఆప్షన్ ద్వారా నిర్వహించాలని భావిస్తే, ఉపాధ్యాయ సంఘాల నేతలు వ్యతిరేకించారు. మాన్యువల్ విధానంలో నిర్వహించాలని కోరారు. ఈ క్రమంలో విద్యాశాఖ సైతం మ్యానువల్ కౌన్సెలింగ్‌కు ఆమోదం తెలపడంతో ఈనెల 7న జరగాల్సిన ఎస్జీటీల బదిలీ ప్రక్రియ మూడు మూడ్రోజుల ఆలస్యంగా 10వ తేదీన ప్రారంభమై ఆదివారంతో ముగిసింది.

8301 మంది బదిలీలు, 339 మందికి పదోన్నతులు

8,301 మంది టీచర్లు బదిలీ కాగా, 339 మంది పదోన్నతులు పొందారు. ఇందులో 167 హెచ్ఎంలకు, 4,800 స్కూల్ అసిస్టెంట్లు, 3,334 సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీలు కాగా, 186 మంది స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్ఎంలుగా, 153 మంది సెకండరీ గ్రేడ్ టీచర్ల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. సోమవారం నుంచి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో టీచర్లు పూర్తి స్థాయిలో విధులకు హాజరు కానున్నారు. ఈ ప్రకియలో తిరుపతి డీఈవో కుమార్‌తోపాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల విద్యాశాఖ ఏడీలు, టెక్నికల్ టీం, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజికాంశాలే పాత్రలకు ఇతివృత్తాలు

కళాకారుల సమ్మేళనంలో నటుడు రాజేంద్రప్రసాద్



కళాకారుల సమ్మేళనాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న రాజేంద్ర ప్రసాద్ తదితరులు - రాజేంద్ర ప్రసాద్, సుద్దాలకు సత్కారం

చిత్తూరు కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సగటు మనిషి నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలే తెరమీద పాత్రలకు ఇతివృత్తాలని సినీనటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం నాగయ్య కళా క్షేత్రంలో ఓం కేశవరెడ్డి ఫౌండేషన్, భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో కళాకారుల సమ్మేళనం జరిగింది. పాటల రచయిత సుద్దాల అశోక్ తేజ, పారిశ్రామికవేత్త సర్వేపల్లె సుబ్రహ్మణ్యశర్మ, భారతీయ తెలుగు రచయితల సమాఖ్య అధ్యక్షుడు మర్రిపూడి దేవేంద్రరావు, ఓం కేశవరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీధర్‌రెడ్డిలతో కలిసి రాజేంద్రప్రసాద్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెర మీద నవరసాలొలికించే పాత్రలకు ఆధారం సగటు మనిషి జీవితమేనన్నారు. ఆర్థిక, సామాజిక, కుటుంబ సమస్యలే కథలకు మూలమన్నారు. చిత్తూరు నాగయ్య, కేఆర్ విజయ, దేవిక , శంకరంబాడి సుందరచార్య పుట్టినగడ్డ చిత్తూరు అని కొనియాడారు. సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. ఎందరో సాహితీమూర్తులు, కళాకారులకు చిత్తూరు నగరం పుట్టినిల్లు అన్నారు. సర్వేపల్లె సుబ్రహ్మణ్యంశర్మ మాట్లాడుతూ.. చిత్తూరు అంటే స్వాతంత్రోద్యమం స్ఫురణకు వస్తుందన్నారు. చిత్తూరులో కళారంగం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే రాజేంద్రప్రసాద్ అంటే వల్లమాలిన అభిమానం అని, ఆయన నటించిన అహనా పెళ్లంట సినిమా చాలాసార్లు చూశానని చెప్పారు. అనంతరం రాజేంద్రప్రసాద్‌ను సత్కరించి.. నటవిభూషణ, విశ్వ నవరస నటన సార్వభౌమా నటనా చక్రవర్తి బిరుదును నిర్వాహకులు ప్రదానం చేశారు. అశోక్‌తేజను కూడా సన్మానించి, కవిభాస్కర బిరుదు ప్రదానం చేశారు. దాదాపు 200మంది సాహితీవేత్తలను, కళాకారులను సత్కరించారు. నిర్వాహకులు దేవేంద్రరావు, శ్రీధర్‌రెడ్డి, నారాయణ స్వామి, గోవిందన్‌లను కళాకారులు సత్కరించారు.

విశాఖ యోగా సంగమ నిర్వహణకు ఇద్దరు ఎమ్మెల్యేలకు పిలుపు

తిరుపతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈనెల 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా సంగమం కార్యక్రమ నిర్వహణ కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలకు పిలుపు వచ్చింది. విశాఖలో 21న ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే ఈ కార్యక్రమంలో 40 దేశాలకు చెందిన ప్రతినిధులతో పాటు 5లక్షల మంది ప్రజలు పాల్గొంటారని అంచనా. యోగా సంగమం విశాఖలో జరుగుతుండడం, దేశప్రధాని స్వయంగా పాల్గొంటున్న కారణంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పరిగణిస్తోంది. దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా యోగా సంగమం నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా 15మంది ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు నుంచి పిలుపు అందింది. ఈ కార్యక్రమ నిర్వహణలో కీలక బాధ్యతలను వారికి అప్పగించనున్నట్లు సమాచారం. ఆ 15మందిలో ఉమ్మడి జిల్లా నుంచి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఉన్నారు. వీరిద్దరూ ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి రైల్లో విశాఖకు బయల్దేరి వెళ్లారు. వారికి ఏ బాధ్యతలు అప్పగించేది సోమవారం తెలియనుంది.



రైలులో బయల్దేరిన అమర్, నాని

నిషేధం ముగిసినా.. వేటకు అంతరాయం

సముద్రంలో అలల ఉధృతితో ఆగిన మత్స్యకారులు ● సాయంత్రం వెళ్లిన కొన్ని పడవలు

కోట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సముద్ర వేటకు 61 రోజుల నిషేధం ముగిసింది. ఇక, ఆదివారం చేపలు పట్టేందుకు సముద్రంలోకి వెళ్లేందుకు సిద్ధమైన మత్స్యకారులకు అలల రూపంలో ఆటంకం ఎదురైంది. దీంతో సాయంత్రానికి కొందరు మాత్రమే బోట్లలో వెళ్లారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి సందర్భంగా మత్స్యశాఖ అధికారులు కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లోని మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా నిషేధం విధించారు. ఆంక్షల సమయంలో మత్స్యకారులు అతిక్రమించి చేపల వేటకు వెళ్తారన్న సముద్రంలో ఎప్పటికప్పుడు మత్స్యశాఖ పర్యవేక్షిస్తూ వచ్చింది. ఈ రెండు నెలల కాలంలో అరకొరతప్ప పలువురు సముద్రంలో చేపలవేటకు వెళ్లే మత్స్యకార కుటుంబాలు పస్తులతో గడపాల్సివచ్చింది. సముద్రంలో చేపల వేట నిషేధ గడువు ముగియడంతో ఆయా మండలాల్లోని మత్స్యకారులు ఆదివారం ఉదయం బోట్లు, పడవలతో సముద్రంలో వెళ్లారు. అయితే, తెల్లవారుజామునుంచే సముద్రంలో విపరీతమైన గాలులు, అలజడులు ఉండటంతో వేటకు వెళ్లలేక వెనుదిరిగారు. కోట మండలం శ్రీనివాసపురం, గోవిందపల్లిపాళెం ముఖద్వారాల నుంచి మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లలేకపోయారు. భయంకరమైన అలలు, విపరీతమైన గాలులు వీస్తుండటంతో ఎక్కడ బోట్‌లు కొట్టుకుపోతాయోనని భయాందోళనకు గురై సముద్రం వద్దకెళ్లి కొంతమంది బోట్లను ముఖద్వారం వద్దకు తీసుకువచ్చారు. అయితే బాగా పొద్దుపోయేదాక 180 బోట్లకుగాను కేవలం మూడు మాత్రమే అలలు, గాలులకు లెక్క చేయకుండా సముద్రంలోకి వెళ్లినట్లు మత్స్యకారులు తెలిపారు. ఇక, చిల్లకూరు మండలం తమ్మినపట్నం, గుమ్మళ్ల దిబ్బ ముఖద్వారాల నుంచి బోట్లు వెళ్లలేదు. వాకాడు మండలం కొండూరుపాలెం, తూపిలిపాలెం నుంచి అరకొరగా బోట్లు వెళ్లినట్లు సమాచారం. సోమవారం నుంచి యథావిధిగా సముద్రంలో వేటసాగే అవకాశాలు ఉన్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.



కోట మండలం గోవిందపల్లిపాళెం ముఖద్వారం నుంచి సముద్రంలోకి వెళ్తున్న బోట్

బారులు తీరిన 'మామిడి' ట్రాక్టర్లు



100 గొల్లపల్లెలోని జైన్‌ఫ్యాక్టరీ వద్ద క్యూ కట్టిన ట్రాక్టర్లు

గంగాధరనెల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు పంచాయతీ 100 గొల్లపల్లెలోని జైన్‌ఫ్యాక్టరీ వద్ద ఆదివారం తోతాపురి మామిడి కాయల లోడు ట్రాక్టర్లు భారీ సంఖ్యలో బారులు తీరాయి. మామిడి కాయల పర్మిట్లకు సంబంధించి రైతులుశనివారం ఫ్యాక్టరీ ఎదురుగా చిత్తూరు - పుత్తూరు రహదారిపై నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి ఉన్నతాధికారులకు రైతుల పరిస్థితి వివరించారు. ఫలితంగా ఆదివారం వరకు పర్మిట్లతో మామిడికాయల తరలింపునకు అనుమతిస్తామన్నారు. సోమవారం నుంచి పర్మిట్లతో సంబంధం లేకుండా మామిడికాయల లోడ్ ట్రాక్టర్లను క్యూ ప్రకారంగా అన్‌లోడింగ్‌కు పంపించనున్నట్లు చెప్పారు. ఈక్రమంలో ఆదివారం ఉదయానికే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులే కాకుండా, ఇతర మండలాల రైతులు కూడా పోటీ పడుతున్నారు. మామిడికాయల ట్రాక్టర్లను క్యూలో పెడుతున్నారు. చిత్తూరు-పుత్తూరు రోడ్డు పక్కన సుమారు 200 ట్రాక్టర్లకు పైగా ట్రాక్టర్లు బారులు తీరి ఉన్నాయి.

నేడు కేంద్రమంత్రిచే క్రిస్‌సిటీ ఏరియల్ సర్వే

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2,500 ఎకరాల్లో చేపట్టిన కృష్ణపట్నం ఇండస్ట్రియల్ నోడ్ (క్రిస్ సిటీ) పనులను కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పియూష్‌గోయల్ సోమవారం ఉదయం హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ వెంకటేశ్వర్ కేంద్రమంత్రితో కలిసి రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి క్రిస్‌సిటీ ఏరియల్ సర్వేలో పాల్గొంటారు. క్రిస్‌సిటీ అభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై జిల్లా అధికారులతో కేంద్రమంత్రి చర్చించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే రూ.200 కోట్లకుపైగా జరిగిన క్రిస్‌సిటీ పనులపైనా ఆయన సమీక్షించనున్నారు. పాల్గొనేందుకుగాను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం రాత్రి విమానాశ్రయానికి చేరుకోగా.. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్, బీజేపీ నేతలు స్వాగతం పలికారు. తిరుమలకు వెళ్లిన కేంద్ర మంత్రి సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని, ఏరియల్ సర్వేలో పాల్గొననున్నారు.




విమానాశ్రయంలో కేంద్ర మంత్రి గోయల్

'కొండ'ంత జనం



క్యూలో చిన్న పిల్లల అవస్థలు



కృష్ణతేజ సర్కిల్ నుంచి శిలాతోరణం వరకు క్యూలో వేచి ఉన్న భక్తులు

వేసవి సెలవుల తర్వాత స్కూళ్లు మొదలైన నేపథ్యంలో శ్రీవారి ఆశీస్సుల కోసం పిల్లలతో వచ్చే తల్లిదండ్రుల సంఖ్య అధికంగా ఉంది. ఈక్రమంలో శుక్ర, శనివారాల తరహాలో ఆదివారం కూడా తిరుమల క్షేత్రం కిటకిటలాడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్కులోని షెడ్లు మొత్తం భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ సుమారు కిలోమీటరు మేరకు రింగురోడ్డులో వ్యాపించింది. భారీ పొడవైన క్యూలైన్లలో చిన్నపిల్లలు, వృద్ధులకు అవస్థలు తప్పలేదు. క్యూలైన్లలోని భక్తులు ఇబ్బందులు లేకుండా టీటీడీ నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ అందజేసింది. రద్దీ కొనసాగుతున్న క్రమంలో శ్రీవారి ఆలయ ప్రాంతం, లేపాక్షి, రాంభగీచ కూడళ్లతో పాటు గదులు కేటాయించే కౌంటర్లు, కల్యాణకట్టలు, లడ్డూకేంద్రం, అఖిలాండం, యాత్రికులు వసతి సముదాయాలు, అన్నప్రసాద భవనాల్లో భక్తుల సందడి నెలకొంది. మరోవైపు తిరుగుప్రయాణ భక్తులతో బాలాజీ, రాంభగీచా ఆర్టీసీ బస్టాండ్లు రద్దీగా దర్శనమిచ్చాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పశువుల సంచారంతో ట్రాఫిక్ కష్టాలు



కుప్పంలోని రహదారులపై తిష్టవేసిన గొర్రెలు

కుప్పం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో పశువులను వచ్చిలవిడిగా రోడ్లపై వదిలేస్తున్నారు. గొర్రెలు, మేకలే కాదు.. ఆవులు, ఎద్దులను సైతం యజమానులు మేతకు తోలకుండా పట్టణంలోని రోడ్లపై తరిమేసి, ఇళ్లపైకి పంపతున్నారు. దీంతో పశువులన్నీ రోడ్లపై తిష్టవేయడమే కాకుండా ఇళ్ల ఎదుట పెంచుకుంటున్న మొక్కలను మేసేసి పర్యావరణానికి హాని చేస్తున్నాయి. అంతే కాదు.. వాహనాల రాకపోకలకు అడ్డు తగులుతూ ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. మరీ ముఖ్యంగా బైపాస్ ఫ్లై వోవర్‌కు అటూ ఇటూ ఉన్న ట్రాఫిక్ కూడళ్ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరం సంచరిస్తున్న పశువుల కారణంగా పలు రోడ్డు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ట్రాఫిక్ కూడళ్లు, డివైడర్ల వద్ద పురపాలక సంఘం పెంచుతున్న పచ్చదనానికి కూడా ఈ పశువుల కారణంగా ముప్పు వాటిల్లుతోంది. పశువులను వచ్చిలవిడిగా వదిలేసిన యజమానులకు జరిమానాలు విధిస్తామని, పశువులను బంధించి నష్ట పరిహారం వసూలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఎన్నోమార్లు ప్రకటించారు. అయితే ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు మాత్రం లేవు. ఇకనైనా రోడ్లపై పశువులు విచ్చలవిడిగా తిరగకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

తాగునీటి బోరు కోసం విద్యుత్ స్తంభాల ఏర్పాటు



నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

చౌడేపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తాగునీటి బోరు కోసం నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో లీలామాధవి, ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ పేర్కొన్నారు. ఆదివారం మాట్లాడుతూ మండలంలోని చారాలలో తాగునీటి బోరుకి విద్యుత్ సరఫరా కోసం స్థానికులు గత కొంత కాలంగా కట్టెలు నాటి విద్యుత్ తీగలు లాగి ఉంచడంతో ప్రమాకరం అని భావించి గ్రామస్తుల వినతి మేరకు పంచాయతీ అధికారుల ప్రతిపాదనలతో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నీళ్లకుంటలో ఘనంగా గంగజాతర



నీళ్లకుంటలో గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని నీళ్లకుంట గ్రామంలో ఆదివారం గంగమ్మజాతర ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ దుగ్గినవారిపల్లెలో జరిగిన గంగమ్మ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ నాయకులు గిరిబాబు, శ్రీనివాసులు, సుధాకర్, శంకరయ్య, పురుషోత్తం, మండల నాయకులు వెంకటరత్నం, గణేష్, రామ్మూర్తినాయుడు, భాస్కర్, హేమసుందరం, నరేష్‌రెడ్డి, వినోద్, వెంకటేష్, దయ, అమరనాథ్‌రెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీచే వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించాలి



ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మాదిగకల్లాడు గ్రామస్తులు

పలమనేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కొలమాసనపల్లి పంచాయతీ పరిధిలోని మాదిగకల్లాడు హరిజనవాడ వద్ద టీడీడీచే వెంకటేశ్వరస్వామి ఆలయం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ ఆదివారం గ్రామస్తులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కొలమాసనపల్లి పంచాయతీ దుగ్గినవారిపల్లి గంగమ్మ జాతరలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసి విన్నవించారు. కార్యక్రమంలో మండల టీడీపీ కార్యదర్శి గణేష్, మాజీ జడ్పీటీసీ వెంకటరత్నం, మాజీ సర్పంచ్ హేమసుందరం, సీనియర్ నాయకులు జగదీష్, బాబు, సెల్వరాజు, హరీష్, వెంకటేష్, తెలుగు యువత నాయకులు నరేష్, వినోద్, వెంకటేష్, సునీల్, దయ, దేవేంద్ర, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ



భీమసేనుడు, దుర్యోధన పాత్రధారుల యుద్ధ సన్నివేశం

సోమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భారతం మిట్టలో మహాభారత యజ్ఞం సందర్భంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర నాట్య మండలి కళాకారులు దుర్యోధన వధ ఘట్టం ప్రదర్శించారు. ధర్మరాజుల ఆలయం ఆవరణలో నిర్వాహకులు బంకమట్టితో దుర్యోధనుడి బొమ్మను రూపొందించి పూజలు చేశారు. దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుంచి బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. దుర్యోధనుడు, భీమసేనుల మధ్య యుద్ధ సన్నివేశాలు, పద్యాలు ప్రేక్షకులను అలరించాయి. భీమసేనుడు దుర్యోధనుడిని తొడపై గద్దతో కొట్టి వధించి రక్తాన్ని ద్రౌపతీదేవి కురులకు పూసే సన్నివేశాలకు పాత్రధారులు జీవంపోశారు. ఈ సందర్భంగా కళాకారులను ఉభయదారులు నెలుకూరివారిపల్లెకు చెందిన బాలే గంగాధరం, కనకరత్నం, టి.చంద్రప్ప, ఎం.వాసు కన్నయ్య, చిన్న మల్లయ్య వ్యవహరించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పుంగనూరు కవుల పాత్ర ప్రశంసనీయం



సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజను కలిసిన పుంగనూరు కవులు

పుంగనూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాహిత్య చరిత్రలో పుంగనూరు కవుల పాత్ర ప్రశంసనీయమని ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ఆదివారం చిత్తూరులో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంబీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కళాజ్యోతి జాతీయ పురస్కారాలు, రచయితల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పుంగనూరు రచయితల సంఘానికి చెందిన కవులను ఆయన ఘనంగా సన్మానించారు. బాడాల రామకవి, శ్రీనివాసపురం సోదరులు సమాజానికి ఆదర్శంగా నిలిచే అనేక రచనలు చేశారన్నారు. పుంగనూరు రచయితలు సంఘం వ్యవస్థాపకుడు నాగరాజ పరంకుశ, కార్యదర్శి సతీశ్‌కుమార్‌రాజు, హసీనాబేగం, గాయిత్రి స్రవంతిలను సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నారాయణస్వామి, ఎంవీ శ్రీధర్‌రెడ్డి, వ్యవస్థాపకులు మర్రిపూడి దేవేంద్రరావు కళాజ్యోతి జాతీయ స్థాయి పురస్కారాలు అందించి అభినందించారు.

యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇప్పించాలి



కేంద్ర మంత్రిని కలిసిన పగడాల రమణ

పుంగనూరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని 5 వేల మంది యువతకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని జనసేన జిల్లా కార్యదర్శి పగడాల రమణ ఆదివారం కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ మంత్రి చౌదిరిజయంత్‌ను కోరారు. హైదరాబాదులో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణకు హాజరైన ఆయన మంత్రిని కలిసి పుంగనూరు సమస్యలు విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కేంద్ర పథకాలపై ప్రజల్లో చైతన్యం

పుంగనూరు రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కేంద్ర పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి బీజేపీ నాయకులు సిద్ధమవుతున్నట్లు బీజేపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు బీనరసింహులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశంలో 11 ఏళ్ల బీజేపీ పాలనపై సంబరాలు చేయడంతో పాటు పథకాల అమలుపై ప్రజలకు తెలియజేయడానికి అన్నమయ్య జిల్లాలో ప్రచారం చేయడానికి తనకు బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

అసంపూర్తిగా నెల్లిమంద సచివాలయ భవనం



అసంపూర్తిగా ఉన్న నెల్లిమంద సచివాలయ భవనం

సోమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నెల్లిమంద సచివాలయ భవనం అసంపూర్తిగా పనులు ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 13 పంచాయతీల్లో సచివాలయ భవనాలు పూర్తి చేసి అధికార కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. నెల్లిమంద సచివాలయం మాత్రం అసంపూర్తిగా నిలిచిపోవడంతో పాత పంచాయతీ కార్యాలయంలోనే అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆగిపోయిన భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తల్లిదండ్రులను.. నిర్లక్ష్యం చేయడం నేరం

పుంగనూరు, పలమనేరు న్యాయమూర్తులు షేక్ ఆరీఫా, ఎం.లిఖిత



పలమనేరు: సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్‌జడ్జి ఎం.లిఖిత



పుంగనూరు: సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి షేక్ ఆరీఫా

పలమనేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ యాక్టు 2007 మేరకు ఎవరైనా తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసినా, వేధించినా చట్టరీత్యా నేరమని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి ఎం.లిఖిత అన్నారు. ఆదివారం పలమనేరులోని పలమనేరు పరిరక్షణ సమితి కార్యాలయంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2007లో సీనియర్ సిటిజన్ల కోసం రక్షణ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఎవరైనా పిల్లలు తమ తల్లిదండ్రుల నుంచి ఆస్తులను రాయించుకొని నిరాధరణకు గురిచేస్తే తిరిగి చట్టం ద్వారా ఆ ఆస్తులను తల్లిదండ్రులు స్వాధీనం చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ, వైద్య సేవలు, నివాస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత వారి పిల్లలపై ఉందన్నారు. పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్ మాట్లాడుతూ వయోవృద్ధులను సంరక్షించాల్సిన బాధ్యత వారి పిల్లలతో పాటు మనవళ్లు, మనవరాళ్లు, కోడళ్లకు ఉందన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారందరూ సీనియర్ సిటిజన్లుగా గుర్తింపబడుతారని, తమ వయస్సు నిర్ధారణ పత్రాలను తీసుకెళ్లి సమీపంలోని గ్రామ సచివాలయాల్లో సీనియర్ సిటిజన్ కార్డు పొందవచ్చన్నారు. బాధితులు ఎక్కడ నివాసముంటే ఆ ప్రాంతంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని న్యాయం కోసం ఆశ్రయించవచ్చన్నారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది అరీఫుల్లాఖాన్, పలమనేరు ఎస్‌ఐ స్వర్ణతేజ, పలమనేరు పరిరక్షణ సమితి అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, పీపీఎస్ సభ్యులు ఆనందబాబు, సిద్దయ్య, నరసింహులు, శ్రీపురసీతారామయ్య, ఇతర ఎన్జీవో సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● **పుంగనూరు:** వృద్ధ తల్లిదండ్రులపై ప్రేమానురాగాలు చూపాలని పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక దోబీ కాలనీలోని వృద్ధాశ్రమంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ పిల్లలు వయస్సు మీరిన వృద్ధులపై నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వృద్ధులను పోషించాల్సిన బాధ్యత బిడ్డలపై ఉందని.. పలుచోట్ల పిల్లలు నిర్లక్ష్యం చేయడం బాధాకరమని తెలిపారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

కమనీయం.. వెంకటరమణస్వామి కల్యాణం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పుంగనూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కోనేరు వద్ద వెలసిన పుంగనూరు కల్యాణ వెంకటరమణస్వామి వారికి ఆదివారం రాత్రి వేదపండితులు కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు వెంకటరమణస్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉభయదారులుగా బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ వ్యవహరించారు.

తెగిన చెరువుకట్టకు మోక్షం కలిగేనా..!



నంజంపేట - పొదలకుంటపల్లె మార్గంలో తెగిన చెరువు కట్ట

సోమల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేట - పొదలకుంటపల్లె మార్గంలో ఏడాది క్రితం తెగిపోయిన దళవాయి చెరువుకట్టకు మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది భారీ వర్షాలతో సోమప్ప చెరువుకు వరదనీరు చేరడంతో దళవాయి చెరువు నీటితో నిండిపోయింది. ఈ క్రమంలోనే దళవాయి చెరువు తూము వద్ద లీకేజీతో కట్ట తెగిపోయింది. దీంతో నంజంపేట - పొదలకుంటపల్లె మార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి. ఇదే మార్గంలో తిరుపతి, పీలేరు డిపోల నుంచి పెద్దఉప్పరపల్లెకు వచ్చే ఆర్టీసీ బస్సులు ఆగిపోయాయి. నంజంపేట హైస్కూల్‌కు పొదలకుంటపల్లె, తుగడంవారిపల్లె, వడ్డిపల్లె, తిమ్మానాయనపల్లె, అగ్రహారం, కురవపల్లె విద్యార్థులు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో అధికారులు చెరువులోనే తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి బస్సులు ఆగిపోయాయి. ప్రస్తుతం చెరువులోకి వర్షపు నీరు చేరకుంటే తాత్కాలిక మార్గంలో రాకపోకలు సాగే పరిస్థితి ఉండదు. రాబోవు వర్షాకాలాన్ని గుర్తించి అధికారులు తెగిపోయిన దళవాయి చెరువు కట్ట పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి

చౌడేపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గడ్డంవారిపల్లె రోడ్డులోని దొడ్డిగానిదేవలం సమీపంలోని ఓ మామిడితోటలో కాపలా ఉన్న రవి (30) రెండు రోజుల క్రితం భార్యతో గొడవపడి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తిరుపతి రుయాకు తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న దొరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



యాదమరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 1991-92 బ్యాచ్‌లో పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు పరస్పరం అభినందించుకుని నాటి విశేషాలను నెమరువేసుకున్నారు. పాఠశాలకు మంచినీటి శుద్ధియంత్రానికి రూ.10వేలు అందజేశారు. పాఠశాల ఆవరణ శుభ్రం చేశారు. తమకు పాఠాలు నేర్పించిన గురువులు బాబా సాహెబ్, ప్రసాద్, చంద్రారెడ్డి, గోవింద పిళ్ళై, శాంతకుమారిలను ఘనంగా సన్మానించారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు



పచ్చికాపల్లంలో దుర్యోధన వేషధారిని గంగ మడుగు నుంచి తీసుకొస్తున్న భక్తులు

వెదురుకుప్పం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంట మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం జరిగింది. కార్యక్రమానికి ఎంపీటీసీ మాజీ సభ్యులు పట్నం కాంతమ్మ, ఆర్ముగంరెడ్డి, పట్నం ప్రభాకరరెడ్డి, జ్యోతి ఉభయదారులుగా వ్యవహరించారు. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో దుర్యోధన వధ ఘట్టం వీక్షించడానికి జనం తరలి వచ్చారు. రాత్రి భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. చెంచుగుడిలో కూడా అగ్నిగుండ ప్రవేశంతో వేడుకలు ముగిశాయి. కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో అగ్నిగుండం కార్యక్రమం జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన దుర్యోధన వధ

శ్రీరంగరాజపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ఆవరణలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ కార్యక్రమం అలరించింది. భీముడు, దుర్యోధనుడి పాత్రధారుల యుద్ధ సన్నివేశాన్ని పద్యాల రూపంలో పాడి ఆకట్టుకున్నారు. ద్రౌపదీ, పాండవుల విగ్రహాలకు పూజలు నిర్వహించి, పొంగళ్లు పెట్టారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశాన్ని నిర్వహించారు. వేణునాయుడు, యతిరాజులు నాయుడు, గంధమేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన మురుగునీటి శుద్ధి కేంద్ర నిర్మాణం



పలమనేరు పెద్దచెరువు



పెద్దచెరువులో అర్ధాంతరంగా ఆగిన కాలువ నిర్మాణం, నిలిచిన మురుగునీరు

పలమనేరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పెద్దచెరువులో కలుస్తున్న మురుగునీటిని శుద్ధి చేసి వ్యవసాయానికి వినియోగించుకోవాలన్న ధ్యేయంతో నిర్మించ తలపెట్టిన మురుగునీటి శుద్ధి కేంద్ర నిర్మాణం అటకెక్కింది. పలమనేరుకు ఆనుకొని ఉన్న పెద్దచెరువు సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా ఆయకట్టు దాదాపు అన్ని ఎకరాల్లో ఉంది. అయితే పట్టణానికి ఆనుకొని ఉన్న ఈ పెద్దచెరువులోకి పలమనేరు ఏర్పడిన నాటి నుంచి మురుగునీరు రెండు ప్రాంతాల నుంచి వచ్చి చెరువుకు చేరుకుంటోంది. దీంతో మూడు దశాబ్దాల క్రితం ఇక్కడి మంత్రిగా ఉన్న డాక్టర్ పట్నం సుబ్బయ్య సమస్యను గుర్తించి అప్పట్లోనే మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చెరువులో మురుగునీరు కలిసే ప్రదేశంలోనే మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని ఆయకట్టు పొలాలకు మళ్లించాలని భావించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆయన పరాజయం కావడంతో ఆ ప్రతిపాదన తదుపరి ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఈ సమస్య అభ్యర్థులకు ఎన్నికల హామీగా కొన్నేళ్లపాటు కొనసాగింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, నగరి మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించి అధికారులను స్థలాల ఎంపిక చేయాలని ఆరునెలల క్రితమే ఆదేశాలు ఇచ్చింది. దీంతో అధికారులు పెద్దచెరువు ఆయకట్టు మధ్యలో 3.4 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసింది. అధికారులు కేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలం వివాదాస్పదంగా మారింది. దశాబ్దం క్రితం మురుగునీటిని పెద్దచెరువులో కలవకుండా ప్రత్యేక కాలువను నిర్మించి మురుగునీటిని ఆయకట్టులోని రాజకాలువకు మళ్లించారు. దీంతో ఆయకట్టు దారులు తమ భూముల్లో మురుగునీరు నిలిచిపోతోందని తీవ్రంగా అభ్యంతరం చెప్పడంతో ఆ కాలువను అలాగే విడిచి పెట్టి మురుగునీటిని చెరువులోకే వదిలి పెట్టేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మురుగునీరు చెరువులో కలవకుండా రూ.కోటి అంచనాలతో చెరువులో గుండుబావి సమీపం నుంచి ప్రస్తుతం మురుగునీరు చెరువులో కలిసే ప్రాంతం వరకు ప్రత్యేకంగా పెద్దకాలువ నిర్మాణం చేపట్టారు. అయితే ఇందుకు కేటాయించిన నిధులు మళ్లించడంతో కాలువ నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది.

మళ్లీ తెరపైకి మురుగునీటి శుద్ధి కేంద్రం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు రూ.20 కోట్లు మంజూరు చేసింది. దీంతో అధికారులు పెద్దచెరువు ఆయకట్టు ప్రాంతంలో కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. రెవెన్యూ అధికారులు ఇందుకోసం కావాల్సిన 3.5 ఎకరాలను ఆయకట్టులో గుర్తించారు. ఒక్కో ఎకరాకు ప్రభుత్వం రూ. 2 కోట్లు చొప్పున చెల్లిస్తుందని ఆయకట్టు రైతులను భూసేకరణకు ఒప్పించారు.

మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుతో ప్రయోజనాలు

పలమనేరు పెద్దచెరువులో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. పెద్దచెరువు దాదాపు 80 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో ఆక్రమణలు దాదాపు 15 ఎకరాల వరకు ఉంటుంది. ఈ ఆక్రమణలు తొలగించినా మురుగునీటి శుద్ధి కేంద్రానికి కావాల్సిన స్థలం సమకూరుతుంది. చెరువులోనే మురుగునీరు కలుస్తున్నందున అక్కడే మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి భూమి కోసం ఎవరికి నష్టపరిహారం కింద రూ.7 కోట్లు చెల్లించే అవసరం ఉండదు. బెంగళూరు, మదనపల్లి రహదారులు ఆనుకొనే ఉన్నందున వాహనాలు వెళ్లి వచ్చేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఆయకట్టులోని పొలాలకు శుద్ధి చేసిన నీరు సరఫరా చేసుకునే అవకాశం ఉంటుంది.

నిధులు విడుదల కాకపోవడంతో ఆగిన పనులు

జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, నగరి మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ఆగిపోయింది. ఇందుకోసం ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడమే కారణమని తెలుస్తోంది. పలమనేరు మున్సిపాలిటీలో అధికారులు ప్రతిపాదించిన కేంద్రానికి రోజుకు 8.3 ఎంఎల్‌టీల మురుగునీరు అవసరముంటుంది. అయితే పలమనేరు మున్సిపాలిటీలో నేడు అధికారులు సరఫరా చేస్తున్న నీరు కేవలం 3.1 ఎంఎల్‌టీ మాత్రమే. ఏది ఏమైనా ప్రస్తుతం మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు పనులు అటకెక్కినట్టే.

అలరించిన దుర్యోధన వధ



శ్రీరంగరాజపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ఆవరణలో జరుగుతున్న మహాభారతఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ కార్యక్రమం అలరించింది. భీముడు, దుర్యోధనుడి పాత్రధారుల యుద్ధ సన్నివేశాన్ని పద్యాల రూపంలో పాడి ఆకట్టుకున్నారు. ద్రౌపదీ, పాండవుల విగ్రహాలకు పూజలు నిర్వహించి, పొంగళ్లు పెట్టారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశాన్ని నిర్వహించారు. వేడుకలను తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ధర్మకర్త వేణునాయుడు, యతిరాజులు నాయుడు, గంధమేని రాజశేఖర్ నాయుడు, నారాయణస్వామి నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, కేశవులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: చెన్నారెడ్డిపల్లిలో ఆదివారం దుర్యోధనుని వధ, ధ్వజావరోహణ కార్యక్రమాలు అలరించాయి. 18 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు, ఆదివారం ముగిశాయి. మట్టితో నిర్మించిన దుర్యోధనునికి పూజాకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మట్టిని పవిత్రంగా భావించి గ్రామస్థులు సేకరించి తీసుకునివెళ్ళారు. రాత్రి అగ్నిగుండం తొక్కారు. అనంతరం ధర్మరాజు పట్టాభిషేకం జరిగింది. ఉత్సవాల ముగింపు సందర్భంగా శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించారు. చెన్నారెడ్డిపల్లి, కట్టకిందవూరు, పెరుమాళపల్లి గ్రామస్థులు ఉభయం నిర్వహించారు.

వైభవంగా పడవేటమ్మ తిరునాళ్ల



అంబలి తీసుకెళ్తు న్న భక్తులు

విజయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎల్లసముద్రం ఎస్టీ కాలనీలో ఆదివారం పడవేటమ్మ తిరుణాళ్ల వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్ళు పెట్టి భక్తులు నైవేద్యం సమర్పించారు. మంగళంలో పొన్నియమ్మ ఆలయంలో కూడా పొంగళ్ల పెట్టి, పూజలు నిర్వహించి భక్తులు మొక్కు తీర్చుకున్నారు. మహారాజపురం అరుందతివాడ మాతమ్మ ఆలయంలో మాతమ్మ కొలుపులో అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం నిర్వహణ అభినందనీయం



వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు రూరల్, చిత్తూరు కల్చరల్,జూన్ 15(ఆంధ్రజ్యోతి): పేదల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహణ అభినందనీయమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంఘ కార్యాలయం కోసం అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా చైర్మన్ హేమలత, టీడీపీ నాయకులు సురేంద్రకుమార్, సంఘ సభ్యులు, అమర ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

వంకల ఆక్రమణపై చర్యలేవీ

గుడిపాల,జూన్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు, వంకలు ఆక్రమణకు గురవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామభద్రాపురం పంచాయతీ చెన్నరాయుని చెరువుకు వచ్చే వంకను ఓ వ్యక్తి చదును చేశారంటున్నారు. వంకను చదును చేయడం వలన నీరు రాదన్నారు. ముటుకూరుపల్లె గ్రామానికి చెందిన పాపానాయుడు చెరువు వంకను, శ్రీరంగంపల్లె వంకను సైతం పూడ్చి వేస్తున్నారన్నారు. వర్షాలు కురుస్తున్నా నీరు చెరువుకు చేరడం లేదన్నారు. మూగ జీవాల పరిస్థితి దీనంగా ఉందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

104 ఉద్యోగుల వేతన బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకుడు విక్టర్

చిత్తూరు రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అరబిందో యాజమాన్యం 104 ఉద్యోగులకు రావల్సిన రెండు నెలల వేతన బకాయిలు, ఈఎల్, గ్రాట్యూటీ చొరవ తీసుకొని ఇప్పించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సురేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో 104 సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల వేతనాలను ఇవ్వకుండా అరబిందో సంస్థ 104 ఉద్యోగులను ఇబ్బందికి గురిచేస్తోందన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని వేతనాలను ఇప్పించాలని అన్నారు. భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతీనెల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో 104 సంఘ నాయకుడు విక్టర్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో యోగాసనాలు



వెదురుకుప్పం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం ఆవరణంలో ఆదివారం టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్ సహా ఉద్యోగులు, వేదపండితులు యోగాంధ్రలో భాగంగా యోగాసనాలు వేశారు.

ఘనంగా ఆలయంలో పూజలు



గంగాధరనెల్లూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎగవూరులోగల సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం వార్షికోత్సవం వైభవంగా పూజలు నిర్వహించారు. మూడవ వార్షికోత్సవంలో భాగంగా గణపతి హోమం, లక్ష్మీహోమం, కుంకుమ పూజలను అర్చకులు నిర్వహించారు. భజన బృందం భక్తిగీతాలను ఆలపించారు.

నేడు నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్

చిత్తూరు అర్బన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరవ్వాలని కోరారు.

19న వాహనాల బహిరంగ వేలం

తవణంపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఈచర్ లారీ, కారు, ఏడు ద్విచక్ర వాహనాలను ఈ నెల 19న బహిరంగ వేలం వేయనున్నారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెంట్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో ఈప్రక్రియ నిర్వహిస్తామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు అదే రోజు ఉదయం 10 గంటలకు రుసుము చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చునన్నారు.

వెలుతురుచేనులో కార్డన్ సెర్చ్



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బంగారుపాళ్యం,జూన్15 (ఆంధ్రజ్యోతి): వెలుతురుచేను పంచాయతీలోని పులిమడుగు,సీజేఎఫ్ఎస్ కాలనీల్లో ఆదివారం ఉదయం సీఐ కత్తిశ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానాస్పదంగా ఉన్న ఇళ్ళను సోదా చేశారు. ద్విచక్రవాహనాల రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యువకులకు సూచించారు. గ్రామాల్లోకి అనుమానితులు వస్తే సమాచారం ఇవ్వాలన్నారు. అటవీజంతువులను వేటాడితే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మాతమ్మ తిరునాళ్ల



వెదురుకుప్పం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం తూర్పు అరుంధతీవాడలో జరుగుతున్న మాతమ్మ తిరుణాళ్ల ఆదివారం ముగిశాయి. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సుందరంగా ముస్తాబు చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు.

గాయపడిన వ్యక్తికి పరామర్శ

వెదురుకుప్పం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివారు హొస్కోటలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆళ్లమడుగుకు చెందిన కె.జనార్దన్‌రెడ్డిని తెలుగుయువత, టీడీపీ నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో కిషన్‌చంద్, బట్టే చాణిక్యప్రతాప్, చిన్నమరెడ్డి, హనుమంతరెడ్డి ఉన్నారు.

పుంగనూరు కవుల పాత్ర ప్రశంసనీయం



సుద్దాల అశోక్‌తేజను కలిసిన పుంగనూరు కవులు

పుంగనూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాహిత్య చరిత్రలో పుంగనూరు కవుల పాత్ర ప్రశంసనీయమని ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ఆదివారం చిత్తూరులో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంబీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కళాజ్యోతి జాతీయ పురస్కారాలు, రచయితల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పుంగనూరు రచయితల సంఘానికి చెందిన కవులను ఆయన ఘనంగా సన్మానించారు. బాడాల రామకవి, శ్రీనివాసపురం సోదరులు సమాజానికి ఆదర్శంగా నిలిచే అనేక రచనలు చేశారన్నారు. రచయితలు సంఘం వ్యవస్థాపకుడు నాగరాజ పరంకుశ, కార్యదర్శి సతీశ్‌కుమార్‌రాజు, హసీనాబేగం, గాయత్రి స్రవంతిలను సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నారాయణస్వామి, ఎంవీ శ్రీధర్‌రెడ్డి, వ్యవస్థాపకులు దేవేంద్రరావు కళాజ్యోతి జాతీయ స్థాయి పురస్కారాలు అందించి అభినందించారు.

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి

చౌడేపల్లె, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గడ్డంవారిపల్లె రోడ్డులోని దొడ్డిగానిదేవలం సమీపంలోని ఓ మామిడితోటలో కాపలా ఉన్న రవి (30) రెండు రోజుల క్రితం భార్యతో గొడవపడి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కాసింత దృష్టి పెడితే ఈ సమస్యలకు పరిష్కారం



రోడ్డు పక్కనే ప్రమాదకరంగా బావి

చిత్తూరు కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొద్దిపాటి వర్షానికే కాలువలు నిండి మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దీనివల్ల దుర్గంధం వెదజల్లుతోంది. చిత్తూరు - వేలూరు రాజీవ్‌గాంధీ రోడ్ తపోవనం వద్ద అయితే ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలువలు నిండిపోయాయి. నగరంలోని 50 డివిజన్లలోనూ దాదాపు ఇదే సమస్యలున్నాయి. తరచూ రోగాల బారిన పడుతున్నామని జనం వాపోతున్నారు. ఈ సమస్యలపై కలెక్టర్ నుంచి నగరపాలక అధికారుల వరకు అర్జీల రూపంలో తెలియజేస్తున్నా పరిష్కారం కావడం లేదన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

గుడిపాల: మండలంలోని కోటూరు-చింతగుంటూరు వెళ్లే రహదారిలో రోడ్డు పక్కనే ఉన్న బావి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి బావిలో పడటంతో ఎప్పుడు రోడ్డు కూలుతుందోనని ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈదారిలో పాఠశాల వ్యాన్లు, పాల వ్యాన్లు తిరుగుతుంటాయి. బావి చుట్టూ చెట్ల కొమ్మలు ఉండటంతో ప్రయాణికులకు దీని గురించి తెలియడం లేదు. రాత్రి వేళల్లో ఎదురుగా ఏదైనా వాహనం వస్తే తప్పించడం సాధ్యం కావడం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.





రాజీవ్‌గాంధీ హైరోడ్‌లో మురుగు కాలువలో పేరుకుపోయిన మురుగునీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు

మామిడి రైతులకు రవాణా,కూలీల సమస్య

విజయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కొనుగోలుకు ప్రభుత్వం రాయితీ ప్రకటించినా మండలంలో మామిడి రైతులను వెతలు లేదు. సుమారు వెయ్యి ఎకరాల్లో తోతాపురి సాగులో ఉంది. ఈ రకానికి నిన్నమొన్నటి వరకూ గిట్టుబాటు ధర లేదని రైతులు ఆందోళన చెందారు. ప్రభుత్వం చొరవ తీసుకుని టన్నుకు రూ. 4 వేలు సబ్సిడీ ప్రకటించింది. ఈక్రమంలో ఒక్కసారిగా రైతులు మామిడి కాయల కోతపై దృష్టి సాధించారు. కూలీల కొరత, తరలించడానికి ట్రాక్టర్ల కొరత వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. కొన్ని చోట్ల కూలీలు లేక కోత నిల్చిపోతే, మరికొన్నిచోట్ల గుజ్జు పరిశ్రమకు తరలించడానికి ట్రాక్టర్లు లేవు. కొందరు ట్రాక్టర్లకు ప్రత్యామ్నాయంగా ఈచర్ బండ్లు, లారీలను వినియోగిస్తున్నారు. కోసేలోగా కాయలు మాగి నేలరాలుతున్నాయి



మాగి నేలరాలుతున్న తోతాపురి



నారపరాజుకండ్రిగలో రవాణా కోసం నిరీక్షణ

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



యాదమరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 1991-92 బ్యాచ్‌లో 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు పరస్పరం అభినందించుకుని నాటి విశేషాలను నెమరువేసుకున్నారు. పాఠశాలకు మంచినీటి శుద్ధియంత్రానికి రూ.10వేలు అందజేశారు. పాఠశాల ఆవరణ శుభ్రం చేశారు. తమకు పాఠాలు నేర్పించిన గురువులు బాబా సాహెబ్, ప్రసాద్, చంద్రారెడ్డి, గోవింద పిళ్ళై, శాంతకుమారి, సంయుక్త, జయవళ్ళి, నౌషద్‌లను సన్మానించారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

విజయపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జంబాడ ఆదిఆంధ్రవాడలో ఇటీవల మృతి చెందిన వైసీపీ కార్యకర్త పెంచలయ్య కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. చిత్ర పటానికి పూలు వేసి నివాళి అర్పించారు. కోసలనగరంలో రాష్ట్ర వైసీపీ విభాగం ప్రచార కార్యదర్శి శేఖర్‌రాజు కుటుంబాన్ని కూడా పరామర్శించారు. రాష్ట్ర వైసీపీ సర్పంచ్ సంఘం కార్యాదర్శి గోవర్ధన్‌నాయుడు, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు



కొల్లాగుంటలో దుర్యోధన వధ ఘట్టం

వెదురుకుప్పం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంట మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం జరిగింది. కార్యక్రమానికి ఎంపీటీసీ మాజీ సభ్యులు పట్నం కాంతమ్మ, ఆర్ముగంరెడ్డి, పట్నం ప్రభాకరరెడ్డి, జ్యోతి ఉభయదారులుగా వ్యవహరించారు. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో దుర్యోధన వధ ఘట్టం వీక్షించడానికి జనం తరలి వచ్చారు. రాత్రి భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. చెంచుగుడిలో కూడా అగ్నిగుండ ప్రవేశంతో వేడుకలు ముగిశాయి. కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో అగ్నిగుండం కార్యక్రమం జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



పచ్చికాపల్లంలో దుర్యోధన వేషధారిని గంగ మడుగు నుంచి తీసుకొస్తున్న భక్తులు

వర్షం వస్తే ఈమార్గంలో వాహనచోదకులకు అవస్థలు



దీనబంధుపురం క్రాస్ రోడ్

పాలసముద్రం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-బలిజకండ్రిగ ఆర్అండ్‌బీ రోడ్డులోని దీనబంధుపురం ,రంగాపురం,పుల్లయ్యగుంట క్రాస్‌ల నీరు పారే మార్గం లేక ఇబ్బందులెదురవుతున్నాయి. వర్షాలు కురిసినపుడు అడవుల నుంచి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇసుక,మట్టి పేరుకుపోతున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు యాతన పడుతున్నారు. అదుపు తప్పి పడిపోతున్నారు. అడవుల నుంచి వచ్చే వర్షపు నీరు పోవడానికి కాలువలు లేక పోవడంతో ఈ పరిస్థితి దాపురిస్తోంది. ఫలితంగా తారు రోడ్డుకు ఇరువైపుల ఉన్న మట్టి రోడ్డు కోసుకుపోతోంది. బలిజకండ్రిగ నుంచి పుల్లయ్యగుంట వరకు 13 కిలో మీటర్లు సింగల్ రోడ్డు ఉంది. దీనిని డబుల్ రోడ్డుగా మార్చ పోవడం వలన సమస్య ఎక్కువైయింది.

రోడ్డుపైనే మురుగు : ఇబ్బంది పడుతున్న జనం





ఇళ్లత్తూరు దళితవాడ నుంచి రోడ్డుపై పారుతున్న మురుగు - గుంతలమయమైన ఇళ్లత్తూరు-విజయపురం రహదారి

విజయపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇళ్లత్తూరు దళితవాడ వద్ద రోడ్డుపైనే మురుగు ప్రవహిస్తోంది. దీనివల్ల ఇళ్లత్తూరు - విజయపురం రోడ్డు ధ్వంసమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లత్తూరు దళితవాడ నుంచి మురుగు వెళ్లడానికి కాలువలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గుంతలమయమైన రోడ్లతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇకనైనా మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కమనీయం.. వెంకటరమణస్వామి కల్యాణం



పుంగనూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కోనేరు వద్ద వెలసిన పుంగనూరు కల్యాణ వెంకటరమణస్వామి వారికి ఆదివారం రాత్రి వేదపండితులు కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహిం చారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు వెంకటరమణస్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉభయదారులుగా బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ వ్యవహరించారు.

టీడీపీ గెలుపునకు గోపి సేవలు మరువలేనివి



గోపిని సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు జగన్మోహన్,మురళి, టీడీపీ నాయకులు

పూతలపట్టు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ విజయానికి గంగారపు గోపి చేసిన సేవలు మరువలేనివని పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురజాల జగన్‌మోహన్‌లు అన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి జన్మదినం సందర్భంగా ఆదివారం లక్ష్మయ్యవూరుకు ఎమ్మెల్యేలు వెళ్ళి గోపికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైసీపీ అల్లరిమూకలు ఇబ్బందులకు గురిచేసినా తలొగ్గకుండా గోపీ ధైర్యంగా ముందుకెళ్లారన్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యేలు, గంగారపు గోపిలకు వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వావిల్‌తోట నుంచి పూతలపట్టుకు ఆయన అభిమానులు కార్లు, ద్విచక్ర వాహనాలతో భారీర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద భారీ కేక్ కట్‌చేశారు. వివిధ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఆయనతో కేక్ కట్‌చేయించారు. గజమాలను వేశారు. అన్నదానం నిర్వహించారు. వావిల్‌తోటలో ఉచిత వైద్యరక్తదాన శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యువరాజ్ నాయుడు, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, గంగారపు హరి,టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, నాయకులు ప్రతాపనేని చంద్రమౌళి, గణపతి నాయుడు,హిమగిరి నాయుడు, చంద్రబాబు నాయుడు, సీకే చిట్టి, ఎల్బీఐ లోకేష్ రెడ్డి, గొడుగుచింత దాము, చిరంజీవి నాయుడు, మధు, జగన్నాథం, నరసింహులు, రామమూర్తి నాయుడు, దేవేంద్రరెడ్డి, నేతాజి నాయుడు, బాబురావుతో పాటు ఐరాల, యాదమరి, తవణంపల్లె, బంగారుపాళ్యం మండలాల కన్వీనర్లతో పాటు జిల్లా నాయకులు, కార్యకర్తలు, గోపి యువసేన సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న గంగారపు గోపి, చిత్రంలో ఎమ్మెల్యే మురళి,నాయకులు